వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 73 | మంగళవారం | 12 సెప్టెంబర్ 2023 | పేజీలు : 06 | వెల రూ. 5

# పురిటిగడ్డ రుణం తీర్చుకుంటా

**తూర్పు బరిలో ఎన్ఆర్ఐ**

**కాంగ్రెస్ అగ్రనేతలకు సన్నిహితుడు**

**వారి హామీతోనే రంగంలోని సామల ప్రదీప్ కుమార్**



ఎన్ఆర్ఐగా సుపరిచితుడైన సామల ప్రదీప్ కుమార్ రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధపడుతున్నారు. న్యూయార్క్‌లో సొంత ఐటీ కంపెనీలతోపాటు ఓ కంపెనీకి సీఈఓగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ పురిటి గడ్డకు సేవ చేయడమే తన లక్ష్యమంటూ ప్రకటిస్తున్నారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషిస్తున్న ప్రదీప్ కుమార్‌కు అగ్రనేతల అండదండలు కూడా మెండుగానే ఉన్నాయి.

ప్రత్యేక కథనం 5లో..



6లో

## మోదీపై ప్రజలకు నమ్మకం ఉంది

**వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం**

**ఆపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి**



2లో

## ఇవన్నీ అక్కడి కష్టాలే..

**13 న'యూనివర్సిటీ'సినిమా విడుదల**

**విద్యావ్యవస్థను రక్షించాలన్నదే మా లక్ష్యం**

**సినీనటుడు ఆర్.నారాయణమూర్తి**

# అటకెక్కిన అభివృద్ధి



**నిధులు లేక నీరసిస్తున్న మహా నగరపాలక సంస్థ**

**అస్తవ్యస్తంగా స్మార్ట్ రోడ్లు**

**పొగడ్తలకే పరిమితమవుతున్న కౌన్సిల్ సమావేశం**

**సమస్యలపై స్పందించాలంటున్న జనం**

**రేపు కౌన్సిల్ సమావేశం**

వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి అటకెక్కింది. నిధులు లేక పనులు నీరసించి పోతున్నాయి. కొత్త పాలకవర్గం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్కో డివిజన్ పరిధిలో కనీసం కోటి రూపాయల పనులు కూడా చేయలేదంటూ అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లే బహిరంగంగా విమర్శిస్తున్నారు. స్మార్ట్ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయంటున్నారు. ప్రణాళిక ప్రకారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి చిన్నపాటి వర్షానికే నగరంలోని ప్రధాన వ్యాపార కూడళ్లు జలమయంగా మారుతున్నాయంటున్నారు. సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపించాల్సిన కౌన్సిల్ సమావేశం సైతం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ను పొగడేందుకే సరిపోతుందని విమర్శిస్తున్నారు. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బుధవారం జరుగనున్న కౌన్సిల్ సమావేశంలోనైనా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని వేడుకుంటున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..

## ఎల్లమ్మ తల్లికి బోనాలు

వరంగల్ నగరంలో శ్రావణ మంగళవారం గౌడ కులస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉర్సు ఎల్లమ్మ దేవాలయంలో తల్లికి బోనాలు సమర్పించారు. మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేశారు. గౌడ కుల మహిళలు నెత్తిపై బోనాలు పెట్టుకొని చిన్న పెద్ద అందరూ కలిసి డబ్బు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఎల్లమ్మ దేవాలయానికి చేరుకున్నారు. ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. సమస్త లోకం సుఖసంతోషాలతో ఉండాలని మహిళలు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘ పెద్దలు, కులస్తులు, ఇతర కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందారు. - వరంగల్ వాయిస్, కరీమాబాద్







# అటకెక్కిన అభివృద్ధి

**నిధులు లేక నీరసిస్తున్న మహా నగరపాలక సంస్థ**


**అస్తవ్యస్తంగా స్మార్ట్ రోడ్లు**

**పొగడ్తలకే పరిమితమవుతున్న కౌన్సిల్ సమావేశం**

**సమస్యలపై స్పందించాలంటున్న జనం**

**రేపు కౌన్సిల్ సమావేశం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ లో అభివృద్ధి అటకెక్కింది. నిధుల లేమితో నీరసించిపోతోంది. అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయి. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నగరానికి వచ్చినపుడు హడావిడి చేసి భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి కలరింగ్ ఇస్తున్న బల్దియా పాలకవర్గం ఆ తర్వాత చతికిల పడిపోతోంది. దీంతో వరంగల్ నగరం మురికి కూపంగా మారింది. అడుగడుగునా పైప్ లైన్ లీకేజీలు బల్దియా ఇంజనీరింగ్ అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. అభివృద్ధి నిధుల జాడేలేదు. పలు డివిజన్లలో చేపట్టిన పనులు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కాకపోవడంలో అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం కనిపిస్తుందని నగర



జనం బాహాటంగా ఆరోపిస్తున్నారు. కుక్కలు, కోతులు జనాలపై దాడులు చేస్తున్నా నియంత్రిచే వారే కరువయ్యారు. ఓపెన్ ప్లాట్లపై చర్యలు శూన్యం. దీంతో ఆయా స్థలాల్లో మురుగు నీరు నిలిచి దోమలకు నిలయాలుగా మారుతున్నాయని, వాటిద్వారా నగర ప్రజలు సీజనల్ వ్యాధులకు గురవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలలో వారం రోజుల పాటు పైప్ లైన్ మరమ్మతుల పేరుతో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నా అడిగేవరు కరువయ్యారు. బల్దియాలో పాలన అస్తవ్యస్తంగా మారిందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నా గాడిన పెట్టే వారు లేకపోవడం శోచనీయం.

### అడిగేవారు లేక..

నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన స్మార్ట్ రోడ్లు చాలా వరకు మధ్యంతరంగానే నిలిచిపోయాయి. నిధులు కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం నగర ప్రజల ప్రాణాల మీదకు వస్తున్నా అడిగేవారు కరువయ్యారు. వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డుకు అవసరమైన భూమిని సేకరించి నెలలోగా పనులు ప్రారంభించాలంటూ మే, 2023లో నగరానికి వచ్చిన మునిసిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆఫీసర్లను ఆదేశించారు. వరంగల్ బస్టాండ్ పనులు కూడా నెలలోపే మొదలు పెట్టి, ఏడాదిలోగా పూర్తి చేయాలని డెడ్ లైన్ పెట్టారు. మంత్రి నగర పర్యటన చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు రింగు రోడ్డుకు భూసేకరణ చేసింది లేదు.. వరంగల్ బస్టాండ్ పనులు ప్రారంభించిందీ లేదు. కళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను ఆగస్టు 15నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించిన మంత్రి కేటీఆర్ మాటలను అధికారులు అటకెక్కించారు. సెప్టంబర్ మాసం లోకి అడుగుపెట్టినా ఇప్పటి వరకు కళాక్షేత్రం పనులు పెండింగ్ లోనే ఉన్నాయి. ఇవే కాకుండా డివిజన్లలో చేపట్టిన పలు అభివృద్ధి పనులతో ఆయా ప్రాంతాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. రహదారులను తవ్వి వదిలేయడంతో రాకపోకలు కూడా కష్టంగా మారుతున్నాయి. తాగునీటి ఇబ్బందులు చెప్ప నలవి కావడంలేదు. మురుగు కాలువల్లో సిల్టు పేరుకుపోయి మురుగు నీరు నగరాన్ని ముంచెత్తే స్థాయికి ఎదిగినా దీనిపై పాలకవర్గం చర్యలు చేపట్టకపోవడంపై జనం మండిపడుతున్నారు.

### నిరుపయోగంగా సైకిల్ ట్రాక్..

రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్లుగా మారింది బల్దియా పనితీరు. కోట్ల రూపాయలు వెచ్చించి హనుమకొండ కలెక్టరేట్ నుంచి ఫాతిమా నగర్ వరకు ఏర్పాటు చేసిన సైకిల్ ట్రాక్ నిరుపయోగంగా మారింది. బల్దియా పట్టింపులేమితో సైకిల్ ట్రాక్ గాడి తప్పింది. దీనిపై



ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణ దారులు తమకు అడ్డుగా ఉన్నాయంటూ ట్రాక్ పోల్స్ ను తొలగించారు. దీంతో నేడు ఈ ట్రాక్ ను వినియోగించేవరే కరువయ్యారు. అయితే కేవలం పర్సంటేజీల కోసమే ఈ ట్రాక్ ను నిర్మించాలన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పొగడ్తలకే కౌన్సిల్ పరిమితం..

మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన నిర్వహిస్తున్న కౌన్సిల్ సమావేశాలు కేవలం పొగడ్తలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలున్నాయి. ఆమె చదివే బ్రీఫ్స్ నోట్స్ లో ముఖ్యమంత్రి కేటీఆర్, మంత్రి కేటీఆర్ లను ఆకాశానికి ఎత్తుకోవడం తప్ప నగరంలో జరుగుతన్న అభివృద్ధి శూన్యమంటూ జనం మండిపడుతున్నారు. పొగడ్తలు మాని నగరాభివృద్ధికి బాటలు వేయాలంటున్నారు.

### నేడు కౌన్సిల్ సమావేశం..

వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించనున్నారు. కౌన్సిల్ సమావేశంలో చర్చించే ప్రతి అంశంపై అధికారులు జవాబుదారితనంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. కార్పొరేటర్లు సమస్యలను లేవనెత్తడం అధికారులు చూస్తాం.. చేస్తాం అంటూ దాటవేయడంపై ప్రయోజనంపై ఏంటని ప్రశ్నిస్తున్నారు. గత పాలక వర్గాలు కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలను రికార్డు చేసేవారని, సమావేశం అనంతరం వాటి సాధ్యాసాధ్యాలపై పరిశీలించేవారని చెప్పుకొచ్చారు. ఆ సమస్యను పరిష్కరించడం సాధ్యపడుతుందా.. లేకుంటే అందుకు ఉన్న అవరోధాలు ఏంటనే విషయాన్ని తర్వాత కౌన్సిల్ సమావేశంలో తెలియ జేసేవారు. అయితే ఈ పాలకవర్గంలో మాత్రం దానికి తిలోదకాలు ఇచ్చారు. కార్పొరేటర్లు సమస్యలను లేవనెత్తడం తప్ప అవి పరిష్కారమవుతాయా లేదా అన్న విషయం ఎవరికీ తెలయని అయోమయ పరిస్థితి నెలకొంది. కనీసం ఈ సమావేశంనుంచైనా అధికారులు జవాభుదారితనంగా వ్యవహరించేలా సమస్యలను రికార్డు చేసి వాటి సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందంటున్నారు.

## ఇవన్నీ అక్కడి కష్టాలే..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యావ్యవస్థను రక్షించాలన్న మెసేజ్ తో 'యూనివర్సిటీ' సినిమా తీశామని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేను చిన్నపుడు ఎన్నో కష్టాలు పడ్డానని, చదువు విలువ నాకు బాగా తెలుసన్నారు. ఈ జనరేషన్ లో యువత ఆకర్షనలకు లోనవుతూ తప్పు తోవ పడుతున్నారన్నారు. విద్యావ్యవస్థను రక్షించే విధంగా 'యూనివర్సిటీ' సినిమా తీశామన్నారు. ఇటీవల పేపర్ల లీకేజీతో యువత భవిష్యత్తు ఆగం అవుతోందన్నారు. అత్యధిక జనాభా ఉన్న దేశం దేశంలో విద్య, వైద్యం జాతీయం చేయాలన్నారు. నిరుద్యోగ సమస్య అత్యధికంగా ఉన్నందున అన్ని సంస్థలనూ ప్రైవేట్ పరం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ భారత్ అని చెప్తున్నా నిరుద్యోగ భారతంగా దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. పార్లమెంట్ సాక్షిగా ప్రధానమంత్రి మోడీ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. సమాజాన్ని మేలుకొల్పేలా యూనివర్సిటీ సినిమా ఉంటుందని తెలిపారు. యూనివర్సిటీలో ఉన్న సమస్యలు విద్యార్థులు పడే కష్టాలనే ఈ సినిమాలో చూపించామన్నారు. అక్టోబర్ 13న యూనివర్సిటీ సినిమా దేశ వ్యాప్తంగా విడుదల చేస్తామని తెలిపారు. ఈ సినిమాను అందరు ఆదరించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆర్.నారాయణమూర్తి డిమాండ్ చేశారు. అనంతరం సినిమాలో ఉన్న మూడు పాటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సినిమా యూనిట్, సినిమా పాటలు రాసిన వారు గద్దర్, జలదంకి సుధాకర్, మొటపలుకుల రమేష్, వేల్పుల నారాయణ, ములుగు విజయ్, అరవింద్, దప్పు సత్తి, రావుల సాయి, గడ్డం భాస్కర్, తిరుణహరి శేషు తదితరులు పాల్గొన్నారు.

ఎకనామిక్స్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ యూనివర్సిటీ నేపథ్యంలో తీసిన సినిమాను అందరూ ఆదరించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్ ఆధారంగా రూపొందించిన చిత్రమన్నారు. కష్టపడి చదువుకున్నప్పటికీ ఉద్యోగాలు రాక వారు పడుతున్న బాధను కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు.

## ఓటరు జాబితాను సరిచేయండి

### ఎన్నికల అధికారికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ వినతి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తప్పుల తడకలా ఉన్న ఓటరు జాబితాను సరిచేయాలని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ మంగళవారం గ్రేటర్ వరంగల్ కమిషనర్ రిజ్వానా బాషాకు వినతి పత్రం అందజేశారు. వరంగల్ (తూర్పు) నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలో తప్పులున్నాయని ఆయన పేర్కొన్నారు.



ఒక పోలింగ్ బూత్ నుంచి వేరొక పోలింగ్ బూత్ కు పేర్లను మార్చారని ఆరోపించారు. పాత గ్రెయిన్ మార్కెట్ పోలింగ్ కేంద్రంలోని 137, 138 పోలింగ్ బూతుల్లోని చాలా పేర్లు వేరే పోలింగ్ బూత్ లోకి మార్చారన్నారు. దీనికి తోడు కొన్ని పేర్లు గల్లంతయ్యాయన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తూర్పులోని 27వ డివిజన్ల పరిధిలోని పోలింగ్ స్టేషన్లో ఓటర్ల జాబితాను సరిచేయాలని కోరారు. గల్లంతయిన ఓటర్ల పేర్లను, ఇతర పోలింగ్ బూత్లకు మార్చబడిన పేర్లను, కొత్త ఓటర్ల పేర్లను చేర్చిన ఓటర్ల జాబితాను సంబంధిత పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అందుబాటులో ఉంచాలని కోరారు. అదేవిధంగా 137, 138 పోలింగ్ స్టేషన్లలో బీఎల్ ఓలకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పోలింగ్ బూత్ ను యాకూబ్ పురాలోని ఎస్సీటీ హాస్టల్ లోకి మార్చాలని కోరారు.




# కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ని భర్తరఫ్ చేయాలి

## విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్

## విద్యా సంస్థల బంద్ సంపూర్ణం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ ని వెంటనే భర్తరఫ్ చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. లేకుంటే ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కూయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. మద్దతు పలికిన వివిధ రాజకీయ పార్టీలు, విద్య వాణిజ్య వ్యాపార యజమానులకు కేయూ జాక్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కేయూ వీసీగా ప్రొఫెసర్ తాటికొండ రమేష్ 2021 లో ఛార్జ్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 20 కి పైగా కేసులు ఆయనపై హైకోర్టులో వేశారని ఆరోపించారు. ఇటువంటి నిరంకుశ పాలన నుంచి ముక్తి సాధించాలంటే ఉద్యమం తీవ్రతరం చేయాల్సిందేనని విద్యార్థి నాయకులు పిలుపునిచ్చారు. వీసీ యూనివర్సిటీలో అనుక్షణం భయానక, ఆందోళనకరమయిన వాతావరణాన్ని సృష్టించారని ఆరోపించారు. పోలీసుల ఎస్కార్ట్ తో పరిపాలన చేస్తూ, కాలి నొప్పి పేరుతో ఫాం హౌజ్ నుంచి పాలన కొనసాగిస్తూ విద్యార్థి ఉద్యమాలను అనిచివేస్తున్నారన్నారు. ఆయన పాలనకు చరమ గీతం పాడే రోజులు మొదలయ్యాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ నేతలు ట్రై సిటీ అంతా బైక్ ర్యాలీ నిర్వహించి బంద్ విజయవంతం చేశారు. విద్యార్థులను అడ్డుకునే ప్రయత్నం చేసి కేయూ ఇన్ స్పెక్టర్ తో విద్యార్థి జేఏసీ నేతలు వాగ్వాదానికి దిగారు. ఏసీపీ కిరణ్ కుమార్ విద్యార్థులను సముదాయించి పంపించారు. బంద్ అనంతరం కేయూ కూడలిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ జాక్ చైర్మన్ తిరుపతి యాదవ్, పీడీఎస్ యూ రాష్ట్ర కార్యదర్శి విజయ్ కన్నా, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్ కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రి, ఏబీవీపీ నిమ్మల రాజేష్, అమర్, విజయ్, ఎన్ ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, ఎండి పాషా, రాకేష్ కృషన్, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు నాయక్, పీడీఎస్ యూ నేతలు బి.నరసింహా రావు, మొగిలి, వెంకట్, ఎంఎస్ ఎఫ్ బొచ్చు తిరుపతి, బొట్ల మనోహర్, వడ్డేపల్లి మధు, కాశినాథ్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆరూరి



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** విదేశీ పర్యటన ముగించుకొని తెలంగాణకు తిరిగి వచ్చిన భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఅర్ ను మంగళవారం బీఅర్ ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మర్యాద పూర్వకంగా కలిసిపూల బొకే అందచేసి కృతజ్ఞతలు తెలిపారు.




# సమీక్ష సమావేశానికి తరలిరండి



## వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

## ముఖ్య అతిథిగా హాజరుకానున్న టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ సమీక్ష సమావేశం బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు హంటర్ రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్స్ లో నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు, బ్లాక్ అధ్యక్షులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు స్వర్ణ తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని, కార్యకర్తలు నిరాశ పడకుండా శక్తి వంచన లేకుండా శ్రమించి పార్టీని అధికారంలో తెచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.

# టెట్ నిర్వహణపై సమీక్ష



**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈనెల 15వ తేదీన ఉపాధ్యాయ అర్హత పరీక్ష 2023 జరగనున్న దృష్ట్యా అడిషనల్ కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్, ఫ్లయింగ్ స్క్వాడ్ కు మంగళవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. జిల్లాలోని ఆరు పరీక్ష కేంద్రాలలో ఉదయం 1,421 మధ్యాహ్నం 1,178 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి జుమ్మ్ము నాయక్, కుసుమ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రాకేష్ రెడ్డికే టికెట్ రావ్వాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి రాజేష్ రెడ్డికి టికెట్ రావాలని, ఎమ్మెల్యేగా గెలవాలని మోకాళ్ళపై తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి పలువురు బీజేపీ కార్యకర్తలు, రాకేష్ రెడ్డి అభిమానులు నాగరాజ్, శ్రీకాంత్, తదితరులు తరలి వెళ్లారు. చేతిలో రాకేష్ రెడ్డి ఫొటోతో కూడిన ఫ్లెక్సీ పట్టుకొని మోకాళ్ళపై నడుచుకుంటూ తిరుపతి కొండ ఎక్కారు. ఏనుగుల రాకేష్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక 116 మందితో కాలినడకన తిరుపతి కొండ ఎక్కుతామని మొక్కుకున్నట్లు వారు వెల్లడించారు.






ప్రజా సేవే లక్ష్యమంటూ యువ నేత ఒకరు వరంగల్ తూర్పు బరిలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఎన్ఆర్ఐగా సుపరిచితుడైన ఆయన రంగంలోకి దిగి క్షేత్ర స్థాయిలో పావులు కదుపుతున్నారు. పురిటి గడ్డకు సేవ చేయడమే తన లక్ష్యమంటూ ముందుకొస్తున్నారు. అతనే.. **ఎన్ఆర్ఐ సామల ప్రదీప్ కుమార్.** రాజకీయ రంగంలో అదృష్టాన్ని పరిక్షించుకునేందుకు పోటీకి సై అంటున్నారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సామల ప్రదీప్ కుమార్ దరఖాస్తు చేసుకున్నారు.

**తూర్పు బరిలో ఎన్ఆర్ఐ**
**కాంగ్రెస్ అగ్రనేతలకు సన్నిహితుడు**
**వారి హామీతో రంగంలోకి సామల ప్రదీప్ కుమార్**
**NAPA, GPA, MATA, JPS ఫౌండేషన్ల స్థాపన**
**ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్‌లో కీలక పాత్ర**
**ప్రజా సేవే లక్ష్యంగా అడుగులు**
**ఎన్‌జీఓల ద్వారా పలు సేవా కార్యక్రమాలు**



- గడ్డం కేశవమూర్తి

# పురిటిగడ్డ రుణం తీర్చుకుంటా..







## ఎవరీ ప్రదీప్ కుమార్..?

వరంగల్ నగరంలోని గిర్మాజీపేట ప్రాంతం పద్మశాలీ కమ్యూనిటీకి చెందిన సామల ప్రదీప్ కుమార్ వరంగల్‌లో చదువు పూర్తి చెసుకొని పలు వ్యాపార సంస్థలు నిర్వహించినారు. వ్యాపార రంగంలో అనుభవం సంపాదించిన తర్వాత 1996లో అమెరికా వెళ్లి ఐటీ కంపెనీలో పనిచేశారు. 1998లో న్యూయార్క్‌లో సొంతంగా ఐటీ కంపెనీ ప్రారంభించారు. యూఎస్‌లో ఎంటర్ ప్రెన్యూరర్ గా అక్కడి తెలుగు ప్రజలకు సుపరిచితుడే. ఎన్నో ఐటీ కంపెనీలు స్థాపించారు. ప్రస్తుతం న్యూయార్క్‌లోని ఓ కంపెనీకి సీఈవో, అనేక రియల్ ఎస్టేట్ వెంచర్లలో భాగస్వామిగా కొనసాగుతున్నారు. రిటైల్ ఫ్రాంచైజీలను కలిగి ఉన్నారు. గత 20 సంవత్సరాలుగా కమ్యూనిటీ సేవల్లో పాల్గొన్నారు.

### ప్రొఫైల్..

పూర్తి పేరు : సామల ప్రదీప్ కుమార్
పుట్టిన తేదీ : 15-6-1972
స్వగ్రామం : గిర్మాజీపేట, వరంగల్
తల్లిదండ్రులు : రుష్యేంద్రమణి-జయప్రకాష్
కుటుంబం : సతీమణి-విద్యాదరి
కుమారుడు : ఆదిత్, కూతురు : సునైనా
అత్తమామలు : రామ విమల-వీరస్వామి

## కాంగ్రెస్‌తో అనుబంధం..

ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ లో చాలా సంవత్సరాలుగా సామల ప్రదీప్ కుమార్ చురుగ్గా పనిచేస్తున్నారు. ఐఓసీ గ్లోబల్ చైర్మన్ శామ్ పిట్రోడా నాయకత్వంలో ఐఓసీ యూఎస్ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్నారు. అమెరికాలోని న్యూయార్క్ లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటనకు ఆరువేల మందిని జనసమీకరణ చేసి విజయవంతం చేశారు. దీంతో అక్కడి ప్రవాస భారతీయుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సమావేశం భారతీయ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించిన అతిపెద్ద కార్యక్రమంగా రికార్డు సృష్టించింది. దీంతో అప్పటి నుంచి యూఎస్ఏ లో రాహుల్ గాంధీ కార్యక్రమాలను సమన్వయం చేయడంలో సామల క్రీయాశీలక పాత్ర పోషిస్తున్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో ఐఓసీ గ్లోబల్ చైర్మన్ శామ్ పిట్రోడా మార్గదర్శకత్వంలో న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ నుంచి.. న్యూయార్క్ లోని యూనియన్ స్క్వేర్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వరకు భారత్ జోడో యాత్రను నిర్వహించారు. ఈ యాత్రకు ఇండియా నుంచి వేయి మందికి పైగా హాజరై విజయవంతం చేశారు. అమెరికాలో ప్రవాస భారతీయులను ఏకం చేసి ఐఓసీ కార్యకాలాపాలను చురుగ్గా నిర్వహిస్తున్నారు.

## ఎన్‌జీఓల ద్వారా సేవలు..

అమెరికాలో భారతీయ కమ్యూనిటీకి సేవ చేయాలనే ప్రాథమిక లక్ష్యంతో మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (MATA) ను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థలో వేల మంది ప్రవాస భారతీయులు సభ్యులుగా ఉన్నారు. ఈ సంస్థకు ఇప్పుడు సామల సలహా మండలి సభ్యుడిగా కొనసాగుతున్నారు. సాంస్కృతిక, సామాజిక కార్యకలాపాలు, విద్యార్థుల సహాయం, యునైటెడ్ స్టేట్స్, ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష, వారసత్వం పరిరక్షణ కోసం పనిచేస్తున్నారు. సేవ చేసేందుకు నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్‌ను (NAPA) స్థాపించి పద్మశాలీలకు సేవ చేస్తున్నారు. ఈ సంస్థ నాలుగు వేల మంది పద్మశాలీ ప్రవాస భారతీయులతో నడుస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థకు సలహ మండలి సభ్యుడిగా కొనసాగుతున్నారు. ప్రపంచంలోని పద్మశాలీలను ఏకం చేసేందకు గ్లోబల్ పద్మశాలీ అసోసియేషన్ (GPA)ను ఏర్పాటు చేసి సేవలను మరింత విస్తృత పరిచారు. జీపీఏకు బోర్డు చైర్మన్ గా పనిచేస్తూ సేవలను అందిస్తున్నారు. వరంగల్ లో నిరుపేదలకు సేవ చేసేందుకు ఆయన తండ్రి సామల జయప్రకాశ్ పేరుతో ఎస్ జేపీ ఫౌండేషన్ స్థాపించి పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం..

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోను సామల చురుగ్గా పనిచేశారు. 1999లో అమెరికాలో ఏర్పడిన తెలంగాణ అభివృద్ధి ఫోరం కోర్ కమిటీ సభ్యుడిగా పనిచిసి తెలంగాణ ఉద్యమానికి ఎన్నారైల మద్ధతును పెంపోందిచండంలో విశేష కృషి చేశారు. ఉద్యమ సమయంలో అమెరికాలో పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతోనే ఇక్కడి ప్రజలకు న్యాయం జరుగుతుందని పలు పార్టీలకు తమ ఆకాంక్షను వెలుబుచ్చారు.

## రాజకీయాల వైపు అడుగులు..

మైల్ కదమ్.. జూడ్ వతన్ (కలసి నడవండి, దేశాన్ని ఏకం చేయండి ), మె హెంగై సే నాటా టోడో, మిల్ కర్ భారత్ జోడో (ద్రవ్యోల్బణంతో సంబంధాలను తెంచుకోండి భారత్ ను ఏకం చేయండి ), బెరెజోగారి కా జల్ తాడో, భారత్ కోసం ఎన్నారైలకు రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపుతో సామల ప్రదీప్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగులు వేస్తున్నారు. ఇందుకు రాజకీయ వేదికే సరైన మార్గమని నమ్మి సేవ చేసేందుకు సమాయమత్తం అవుతున్నారు. తాను పుట్టి పెరిగిన వరంగల్ తూర్పు నియోజకర్గంలో పోటీ చేసి గెలవాలని ఆకాంక్షిస్తున్నారు. దీనికి కాంగ్రెస్ అగ్రనేతల అండదండలు ఉండటంతో రంగంలోకి దిగుతున్నారు. అయితే వరంగల్ తూర్పులో పద్మశాలీ కులస్తులు ఎక్కువగా ఉండటం, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు అయిన బీసీ, ముస్లిం, మైనార్టీలు కూడా ఎక్కువగా ఉండటం కలసి వస్తుందని అంచనాతో ఆయన ముందుకు
వెళుతున్నారు.







# మోదీపై ప్రజలకు నమ్మకం ఉంది

**వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం**

**ఆపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రధాని నరేంద్ర మోదీపై ప్రజలకు నమ్మకం ఉందని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్ లోని వేద బంక్వెట్ హాలులో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీ 20 సదస్సు ద్వారా భారత్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు మోదీ కృషి చేశారన్నారు. ఎకనమిక్ గ్రోత్ లో భారత్ ను ఐదో స్థానం నుంచి మూడో స్థానంలో నిలిపేందుకు ఆయన పాటుపడుతున్నారన్నారు. దీంతో దేశ రెవెన్యూ పెరుగడంతోపాటు రాష్ట్రాలకు వచ్చే రెవెన్యూ కూడా అధికమవుతుందన్నారు. జమిలీ ఎన్నికల ద్వారా బీజేపీ సత్తా చూపుతుందన్నారు. రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు బీజేపీ పోరాటం చేస్తోందని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గతేడాది అమిత్ షా ఆధ్వర్యంలో బీజేపీ వేడుకలు నిర్వహించిందన్నారు. అమరుల కుటుంబాలకు గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతోనే బీజేపీ విమోచన దినోత్సవం నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది బీజేపీ ప్రభుత్వంలోనే విమోచన వేడుకలు జరుగుతాయని జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ టిక్కెట్ కోసం ఆరు వేలకు పైగా దరఖాస్తులు చేసుకోవడం శుభపరిణామం అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి గుండె విజయరామారావు, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి డాక్టర్ వి.మురలీధర్ గౌడ్, హనుమకొండ జిల్లా ఇంచార్జి అడ్లూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు ఓ.రామచంద్ర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేశిని సదానందం గౌడ్, ఆర్.పి.జయంత్ లాల్, దొమ్మాటి సాంబయ్య, రత్నం సతీష్ షా, గురిజాల శ్రీరాంరెడ్డి, చల్లా జైపాల్ రెడ్డి, వన్నాల వెంకటరమణ, వీసం రమణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం..

సనాతన ధర్మం పై ఉదయనిధి స్టాలిన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో హనుమకొండ అదాలత్ జంక్షన్ లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మరావు, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి డాక్టర్ వి.మురలీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీజేపీ నాయకులు రాకేష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేశిని సదానందం గౌడ్, ఆర్.పి.జయంత్ లాల్, జిల్లా పధాదికారులు, మహిళా నేతలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం..

**పర్యావరణాన్ని కాపాడుదాం**

**ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు**




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మట్టి వినాయకులను పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదామని ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని కళాశాల సెక్రటరీ కం కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవీవీ విద్యాసంస్థలు చదువుతోపాటు పర్యావరణం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మట్టి వినాయకులనే పూజిస్తాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వినాయకుడు అంటేనే పర్యావరణం.. పర్యావరణం అంటేనే వినాయకుడు అనే అభిప్రాయం ప్రజల్లో కల్పించేందుకే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. వినాయక చవితిని పర్యావరణహితమైన పండుగలా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు చందా శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ భుజంగ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అనిత, చండీశ్వర్, జి.శ్రీనివాస్ సీనియర్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నాణ్యమైన బోధనతో మంచి ఫలితాలు

**కేయూ వీసీ తాటికొండ రమేష్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నాణ్యమైన బోధన, మార్పులపై అవగాహనతోనే మంచి పలితాలు సాధించవచ్చని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. సుబేదారిలోని విశ్వవిద్యాలయ మహిళా పీజీ కళాశాలలో పార్ట్ టైం అధ్యాపకులు నూతనంగా ప్రవేశాలు పొందిన సందర్భంగా వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవటంలో ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన, శోధన ఉండాలని, యూనివర్సిటీ తరువాతి తరం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పీసీ మహిళా కళాశాల అర్థశాస్త్రం విభాగం బోధనా సిబ్బంది డాక్టర్ ఎడెల్లి రవీందర్, డాక్టర్ కె.సంధ్యారాణి, డాక్టర్ గుగులోత్ కవిత, డాక్టర్ వావిళ్ళ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మౌన దీక్షలో మనోడు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** సికింద్రాబార్ పారడైజ్ సెంటర్ లోని గాంధీ విగ్రహం సమీపంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టుకు నిరసనగా మంగళవారం మౌనదీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నుంచి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చిలువేరు రవీందర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బ్యూరో సభ్యులు బక్కాని నరసింహులు, అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, తెలుగుదేశం పార్టీ తెలంగాణ శాఖ ప్రధాన కార్యదర్శి జక్కిలి ఐలయ్య యాదవ్, అదిలాబాద్ తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు గుల్లేపల్లి ఆనంద్, సనత్ నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ పోరాటంతో బీజేపీకి సంబంధం లేదు

**సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి**




**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తుందని, ముస్లిం హిందువుల మధ్య యుద్ధంగా చిత్రీకరిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆరోపించారు. బీజేపీకి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో సంబంధం లేదన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో సాయుధ పోరాట చరిత్ర ఆనవాళ్లు ఉన్నాయన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు కొత్త వెంకటేష్ అధ్యక్షతన ధర్మసాగర్ లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి కొట్టె వెంకటేష్, బట్టు మల్లయ్య, మంచాల రమాదేవి, మాలోత్ శంకర్ నాయక్, రాజయ్య, చిలక బాబు, రాజరేపురత్నం, అంకుష్, మంచాల తిరుపతి, బొట్టు భిక్షపతి, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను రెగ్యూలర్ చేయండి

**కార్పొరేటర్‌కు బీఆర్ టీయూ వినతి**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల శ్రమను గుర్తించి వారిని రెగ్యూలర్ చేసే విధంగా బుధవారం నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయించాలని భారత రాష్ట్ర ట్రెడ్ యూనియన్స్ ప్రతినిధులు 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా కార్మికులను ఉద్దేశించి కార్పొరేటర్ సువర్ణ సురేష్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేసినట్టుగానే మున్సిపల్ కార్మికులకు కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయం చేస్తారన్నారు. రేపు కౌన్సిల్ లో చేర్చించి తీర్మానం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జవాన్ మైదం హరినాద్, కార్మికులు రాజ్ కుమార్, రమేష్, రాణి, కోమల, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com